క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

లింగాల: మండలంలోని అవుసలికుంటకు చెందిన వంగూర్ సాయికుమార్ జావలింగ్ త్రోలో జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సికింద్రాబాద్ అల్వాల్‌లోని ప్రభుత్వ ఐటీఐ డిగ్రీ కళాశాలలో ఎలక్ట్రికల్ వెహికిల్ కోర్స్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆదివారం కల్వకుర్తిలో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో పాల్గొని మొదటి స్థానంలో నిలిచాడు. దీంతో అతని తల్లిదండ్రులు లక్ష్మీదేవమ్మ, బాలస్వామితో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం



వెల్దండ: గిరిజన తండా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి కృషి చేస్తున్నట్లు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గాన్‌గట్టుతండాలో నూతనంగా రూ.3లక్షల నిధులతో నిర్మించిన శుద్ధనీటి వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా తండాలో నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి దేవాలయానికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5 లక్షలు విరాళం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పత్యానాయక్, గోపాల్‌నాయక్, నాయకులు రమేష్‌నాయక్, లోక్య, భిక్య, రాజు, పరమేష్, తరుణ్‌స్వామి ఉన్నారు.

నేడు పింఛన్‌దారుల సన్నాహక సమావేశం

వెల్దండ: రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలోని లక్ష్మీ ఫంక్షన్‌హాల్ సోమవారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో పింఛన్‌దారుల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం మండల నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ హాజరవుతారని పేర్కొన్నారు. పోరాటాలతోనే దివ్యాంగుల హక్కులు సాధ్యమని తెలిపారు.

జిల్లా అధ్యక్షుడిగా యాదయ్యగౌడ్



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాయామ విద్యా ఉపాధ్యాయ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యాదయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సీతారాం, కోశాధికారిగా బాలసుబ్రమణ్యం, మహిళ ఉపాధ్యక్షురాలిగా మణి, ఉపాధ్యక్షుడిగా రాధాకృష్ణ, లక్ష్మణ్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డన్న, రమేష్‌బాబు, స్వరూప, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



కల్వకుర్తి రూరల్: పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని బహుజన సమాజ్ పార్టీ జిల్లా నాయకుడు ఆంజనేయులు అన్నారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డు సభ్యుడు నుంచి జెడ్పీటీసీ వరకు బరిలో ఉంటామన్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు పాటు పడాలని సూచించారు. కార్యక్రమంలో కల్యాణ్, శంకర్, శ్రీశైలం, రాజు, మహేష్, పర్వతాలు తదితరు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

కల్వకుర్తి: స్థానిక ఎన్నికలలో విజయంపై దృష్టి సారించి సత్తా చాటుదామని టాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే వంశీచందర్ రెడ్డి కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఆదివారం చారగొండ మండలం అప్పారెడ్డి పల్లిలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు వంశీచందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, పుస్తకాల రాహుల్, కుడుముల చంద్రకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

చురుకుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

- పైలెట్ ప్రాజెక్ట్‌గా అవుసలికుంట
- మండలానికి 503 ఇళ్లు మంజూరు
- దశల వారీగా బిల్లుల చెల్లింపులు

లింగాల: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మండలంలో చురుకుగా కొనసాగుతున్నాయి. మండలంలోని 23 గ్రామ పంచాయతీలలోని అర్హులైన 424 మంది లబ్ధిదారులను ఎంపిక చేసిన అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. మరో 79 ఇళ్లు చెంచులకు మంజూరి అయ్యాయి. మంజూరైన ఇళ్లను సకాలంలో చేపట్టి పూర్తి చేయాలని అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం ఉండదని సూచిస్తున్నారు.

పైలెట్ ప్రాజెక్ట్‌గా అవుసలికుంట

మండలంలోని అవుసలికుంటను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన అధికారులు ఆ గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. గ్రామానికి 45 ఇళ్లు మంజూరు కాగా ఇందులో 38 ఇళ్లకు అధికారులు ముగ్గులు పోశారు. ఇందులో పునాది వరకు 25 పూర్తి కాగా మరో ఉండగా 21 ఇళ్లకు అధికారులు క్యాప్చర్ చేయగా 19 మంది లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున బిల్లులు అందాయి. స్లాబ్ వరకు 10 ఇళ్లు నిర్మించుకోగా ఇందులో 7 ఆన్‌లైన్ చేయగా రూ.2 లక్షల చొప్పున బిల్లులు మంజూరయ్యాయి.

పలు గ్రామాలలో వివిధ దశల్లో నిర్మాణాలు

మండలంలోని పలు గ్రామాలలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశలలో కొనసాగుతున్నాయి.



అవుసలికుంటలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇల్లు

ఈ నెల 3న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ చేతుల మీదుగా ప్రొసీడింగ్‌లు అందుకున్న లబ్ధిదారులు నిర్మాణాల పనులను చేపట్టారు. కాగా ఆర్థికస్తోమత లేని వారు నిర్మాణాల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. బ్యాంక్‌ల ద్వారా వడ్డీ లేని రుణాలను మంజూరి చేస్తే ఇంటి నిర్మాణాలకు మేలు జరుగుతుందని పలువురు లబ్ధిదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక కొనుగోలుకు ఇబ్బందులు

అందుబాటులో ఉన్న ఇసుకను వాడుకోవాలంటే వ్యవసాయ సీజన్ కావడంతో లభ్యం కాక పోవడంతో లబ్ధిదారులు కొంత మేరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన డంపుల నుంచి ఇసుకను కొనుగోలు చేయాలంటే ఆర్థిక స్తోమత లేని వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుకను తక్కువ ధరలకు విక్రయించుటకు ఎమ్మెల్యే తగు శ్రద్ధ వహించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

సంతోషంగా ఉంది



సొంత ఇంటి కల నెరవేరుతుండటంతో సంతోషంగా ఉంది. పనులు కొనసాగుతున్నాయి. ఉచితంగా ఇసుక ఇస్తే బాగుండు. ప్రభుత్వానికి ఎల్లప్పుడు రుణపడి ఉంటాను. ఇళ్లు మంజూరుకు ఎంపిక చేసిన అధికారులకు, నాయకులకు కృతజ్ఞతలు.

– ఎదిరె రాధిక, లబ్ధిదారురాలు, జీల్గుపల్లి

పదేళ్లుగా ఎదురుచూశాం



కూలి పోయిన ఇంటిలో నివాసం ఉంటున్నాం. ప్రభుత్వ పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం చాలా ఆనందంగా ఉంది. నిర్మాణం పనులను చేపడుతున్నాను. సాధ్యమైనంత త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేస్తాను.

– గట్టు రాములమ్మ, లబ్ధిదారురాలు, జీల్గుపల్లి

నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు



మండలంలోని ఆయా గ్రామాలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రొసీడింగ్‌లు తీసుకున్న లబ్ధిదారులు చాలా మంది ఇంకా నిర్మాణాలను చేపట్టలేదు. వారిని ప్రోత్సహించి పనులు మొదలు పెట్టేలా కృషి చేస్తున్నాం.

– చంద్రశేఖర్, ఎంపీడీఓ, లింగాల

చర్చికి కుర్చీల వితరణ



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సీబీఎం కళాశాలలో ఉన్న చర్చికి వెల్దండ పీఏసీఎస్ చైర్మన్ జూపల్లి భాస్కరరావు రూ.45 వేలు విలువగల 100 కుర్చీలను ఆదివారం బహూకరించారు. చర్చి నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు వీటిని ఆయన అందించారు. దాతకు మాజీ సర్పంచ్ సాయికుమార్, చర్చి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ ఆనంద్, సైదులు, ప్రకాష్, సీతయ్య, ఏసేబు, వెంకటయ్య ఉన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



కల్వకుర్తి రూరల్: పట్టణానికి చెందిన హరికృష్ణ కూతురుకు ఇటీవల వెన్నుముక ఆపరేషన్ అయింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవడంతో విషయం తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు ఆదివారం బాధిత కుటుంబం వద్దకు వెళ్లి రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి అధ్యక్షుడు రసూల్, అంజి గౌడ్, సలీం ఖాన్, శ్రీకాంత్, ఆకుతోట నరేష్, అలీమ్, తరుణ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల, వృద్ధుల పింఛన్లు పెంచాలి

కొల్లాపూర్: ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వృద్ధులు, దివ్యాంగుల పింఛన్లను వెంటనే పెంచాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వడ్డెమాన్ రాములు, సంపంగి మద్దిలేటి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. హామీలు అమలు చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. బంకల కురుమూర్తి, ఏదుల వెంకటేష్, కేశపోగు శేఖర్, పుట్టపాగ రవి, లక్ష్మయ్య, నాగరాజు, రవి తదితరులున్నారు.

ఘనంగా కొడి పీర్ల పండుగ

చారకొండ: మండలంలోని జూపల్లిలో కొడి పీర్ల పండుగ వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి గ్రామంలో మసీదులో పీర్ల చావిడి ఎదుట ఏర్పాటు చేసిన నిప్పుల గుండం చుట్టు గ్రామస్తులు, యువకులు అలయ్ బలయ్ ఆడారు. ఆదివారం తెల్లవారుజామున పీర్లను డప్పు చప్పుళ మధ్య గ్రామంలో పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు పీర్లకు ప్రత్యేక ప్రార్ధనలతో పాటు దట్టీలు, ఊదు బెల్లం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నిర్వహకులు కుద్దుస్, సీరాజ్, వెంకటేష్, అక్రం, మల్లేష్ , వెంకటయ్య, తీర్పతయ్య తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఒత్తిడి సరికాదు

తిమ్మాజిపేట: ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఓ యువకుడిపై బీఆర్ఎస్ నాయకులు ఒత్తిడికి, భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని కాంగ్రెస్ మండల నాయకులు రవూఫ్, లింగం, మాదవ్, దేవస్వామి, ముబారక్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో దళితబంధు పథకం కింద ఇటీవల కాంగ్రెస్ లో చేసిర నాయకుడికి ట్రాక్టర్ మంజూరయ్యిందన్నారు. ట్రాక్టర్‌ను తిరిగి ఇవ్వాలని కొందరు యువకుడిని బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు తీరు మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సమావేశంలో మల్లయ్య, వెంకటయ్య, ఎల్లారెడ్డి, బంగారయ్య, రాజు, సురేందర్, శ్రీకాంత్‌రెడ్డి, రాఘవేందర్, శంకర్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

డంపింగ్ యార్డు తరలించండి

కందనూలు: జిల్లా కేంద్రంలోని చెందాయిపల్లి శివారులో గల డంపింగ్ యార్డును మార్చాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం డంపింగ్ యార్డును సందర్శించి మాట్లాడుతూ ఇక్కడ ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు కొన్ని నెలలుగా చెత్త చెదారంతో, జంతు కళేబరాలతో నిండిపోయిందని, చెత్తను కాల్చివేసే నాథుడే లేడని వాపోయారు. రోడ్డు ద్వారా వ్యవసాయ పొలాలకు వెళ్లే వారికి దుర్వాసనతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, చనిపోయిన కోళ్లు, ఇతర జంతువులను ఇక్కడ పడివేయడం వలన దారి గుండా వెళ్లే వారిని కుక్కలు వెంబడిపడి కరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారిలో కోట మైసమ్మ, ఆంజనేయస్వామి, భువనమ్మ దేవాలయాలు ఉన్నాయని భక్తులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు సందర్శించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డు వద్ద మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మహాసభలను విజయవంతం చేయాలి

చారకొండ: కల్వకుర్తిలో వచ్చే నెల 1, 2 తేదీల్లో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు చిల్వేరు శ్రీనివాసులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్మిక, కర్షక, ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న ఏకైక పార్టీ సీపీఐయేనని పేర్కొన్నారు. జిల్లా మహాసభలకు సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త గూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట్ రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఏసారపు అశోక్ గౌడ్, సీనియర్ నాయకులు మద్దినారాయణ రెడ్డి, శ్రీను ఉన్నారు.

నాగర్‌కర్నూల్ రూరల్: కల్వకుర్తి పట్టణంలో ఆగస్టు 1,2వ తేదీల్లో సీపీఐ జిల్లా 3వ మహాసభలను నిర్వహిస్తునట్లు జిల్లా నాయకులు కొమ్ముభరత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడవెంకటరెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు ఆనంద్‌జి, వార్ల వెంకటయ్య, కేశవులుగౌడ్, ఫయాజ్ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కందనూలు: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏబీవీపీ సోషల్ మీడియా కన్వీనర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాగర్‌కర్నూల్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. మరుగుదొడ్లకు తలుపులు లేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. సంబంధిత అధికారులు పరిశీలించి మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ శివ, బాబు, శ్రీకాంత్, మల్లేష్, ఏబీవీపీ నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయాలుగా యూటర్న్‌లు



చారకొండ: వాహనదారులు రోడ్డు పూర్తివరకు వెళ్లకుండా మధ్యలోనే వెళ్లడానికి ఏర్పాటు చేసిన యూటర్న్‌లతో ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మండలంలోని జూపల్లిలో జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన యూటర్న్‌తో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.సూచిక బోర్డులు లేక దేవరకొండ వైపు వెళ్లే వాహనాలు వేగంతో వస్తుండడంతో నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సూచిక బోర్డులు ఏర్పాటు చేసి రోడ్డు చివరవరకు వాహనదారులు పోయేలా అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.కాగా ఆదివారం యూటర్న్ తీసుకుంటున్న ఆటోను గమనించకుండా కల్వకుర్తి నుంచి వేగంగా వచ్చిన కారు, ఆటోను తప్పించబోయి పక్కకు అదుపుతప్పడంతో కారు ధ్వంసమైంది.

సభ ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే

అచ్చంపేట: అచ్చంపేట ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఈ నెల 21న సాయంత్రం 4 గంటలకు నిర్వహించే ఇందిరా మహిళా శక్తి సంబురాల బహిరంగ సభ ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పరిశీలించారు. కొత్త రేషన్ కార్డులు, మహిళా సంఘాలకు రుణాలు అందించనునట్లు ఎమ్మెల్యే తెలిపారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరేళ్ల శారద, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

విజయవంతం చేయాలి

మన్ననూర్: అచ్చంపేట పట్టణంలోని ఎన్టీఆర్ రాజీవ్ మినీ స్టేడియంలో నిర్వహించే ఇందిరా మహిళా శక్తి సంబరాలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, ఉమామహేశ్వర ఆలయం పాలక మండలి సభ్యురాలు సంబు శోభ, మాజీ వైస్ ఎంపీపీ ప్రణిత, సుజాత కోరారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ తో పాటు ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరవుతారని తెలిపారు.



ఎన్టీఆర్ మినీ స్టేడియంలో సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఎరువుల కేంద్రం ప్రారంభం

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని స్థానిక సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో మన గ్రోమోర్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల కేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం సంస్థ ప్రతినిధులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర టెలికాం బోర్డు మెంబరు శ్రీనివాస్‌బహదూర్, మలయ్యగౌడ్, వెంకట్రామ్‌రెడ్డి, రాందేవ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ,లింగం, మాధవ్, హర్షవర్ధన్, దేవస్వామి, రవూఫ్, ముబారక్, వెంకటయ్య, సురేందర్, వరుణ్ కుమార్, సేవాగ్, సంస్థ ప్రతినిధి ప్రసాద్, పలు గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

బిజినేపల్లి : వట్టెం వేంకటేశ్వరస్వామి దేవస్థా సంగుట్టపై వన మహోత్సవాన్ని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో మర్రి, ఎర్రచందనం, ఇప్ప, రావి వంటి తదితర మొక్కలను నాటి నీరు పోశారు. అంతకుముందు ఆలయంలో పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన వ్యవస్థాపక సభ్యులు సందడి ప్రతాప్‌రెడ్డి, వాస ఈశ్వరయ్య, అనంత నర్సింహరెడ్డి, రామచంద్రారెడ్డి, సురేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, చంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, హకీమ్‌మురళీ పాల్గొన్నారు.



ఎరువుల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

పోస్టర్ల ఆవిష్కరణ



కొల్లాపూర్: ఈ నెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు సూర్యాపేటలో జరగనున్న కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతుల పోస్టర్లను ఆదివారం కొల్లాపూర్‌లో ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ మండల కార్యదర్శి బత్తిని రాజు మాట్లాడుతూ సామాజిక అంతరాలు, కులవివక్షత, అంటరానితనాన్ని నిర్మూలించేందుకు కేవీపీఎస్ పోరాడుతోందని వివరించారు. శిక్షణా తరగతులకు కేవీపీఎస్ నాయకులు హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సంజు, సాయికుమార్, శివ, నాని తదితరులు ఉన్నారు.

అథ్లెటిక్స్ అర్హత పోటీలో విద్యార్థి ప్రతిభ



కొల్లాపూర్: జిల్లా స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ అర్హత పోటీలు ఆదివారం కల్వకుర్తి పట్టణంలో నిర్వహించారు. 60 మీటర్ల పరుగు పోటీలో, స్టాండింగ్ బ్రాండ్ జంప్ పోటీలో కొల్లాపూర్ పట్టణానికి చెందిన తూర్పు అగస్త్య ముదిరాజ్ మొదటి స్థానంలో నిలిచారు. రెండు విభాగాల్లో మొదటి స్థానాల్లో నిలవడంతో అగస్త్యను జనగాం జిల్లాలో ఆగస్టు 7న జరిగే అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.విజేందర్, సాలపోగుల స్వాములు ప్రకటించారు. అగస్త్యను పలువురు అభినందించారు.

అనారోగ్యంతో కార్మికుడు మృతి

పెద్దకొత్తపల్లి: గ్రామ పంచాయతీ కార్మికుడు ఎదురపల్లి రవి(45) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. గ్రామ పంచాయతీ కార్మికులు ఆయన మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దశరథం, పంచాయతీ కార్యదర్శి నాగశేషి, వెంకటస్వామి, రాజేందర్, మద్దిలేటి, బాలస్వామి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆర్థికసాయం

తిమ్మాజిపేట: మండలంలోని నేరళ్లపల్లి గ్రామానికి చెందిన వీరాస్వామి కుమార్తె అనారోగ్యంతో ఆదివారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి రూ.10వేలు సమకూర్చి గ్రామ నాయకులకు అందజేశారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి మాజీ సర్పంచ్ కాంతయ్యగౌడ్, గోవర్ధన్‌రెడ్డిలు నగదు అందజేశారు. అదే విధంగా ఎదిరేపల్లి గ్రామంలో మీసాల రాములు మృతి చెందడంతో బాధిత కుటుంబానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు రూ.5వేల ఆర్థికసాయం చేశారు.

మహిళాశక్తి సంబరాలకు తరలిన మహిళలు

తాడూరు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఇందరా శక్తి మహిళా సంబరాలకు మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల నుంచి మహిళ సంఘాల సభ్యులు ఆదివారం తరలివెళ్లారు. ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి వడ్డీలేని రుణాలు అందించినట్లు ఐకేపీఏపీఎం బాల్‌చందర్ తెలిపారు. ఆయా క్లస్టర్‌ల వారీగా 40 సంఘాలకు మంజూరైన చెక్కులను అందజేశారని తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

నాగర్‌కర్నూల్ రూరల్: అవసరం లేకున్నా రోగులకు వివిధ రకాల పరీక్షలు, స్కానింగ్‌లు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్ అన్నారు. ఆదివారం కేవీపీఎస్ పట్టణ కమిటీ సమావేశాన్ని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులతో ఓపీ ఫీజు రూ.500లు చేస్తున్నారని దీంతో పాటు అనవసరంగా వివిధ రకాల టెస్టుల పేరులో వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, క్రాంతి,రామ్ ఉన్నారు.

కుమ్మరుల పట్టణ కమిటీ ఎన్నిక

తెలకపల్లి: స్థానిక శివాలయ ప్రాంగణంలో ఆదివారం పట్టణ శాలివాహన కుమ్మరుల సంఘం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మరి శాలివాహన సంఘం ప్రచార కార్యదర్శి వట్టిపు పరమేశ్వర్, జిల్లా కుమ్మరి శాలివాహన సంఘం ప్రచార కార్యదర్శి ఆధ్వర్యంలో పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భక్తతుకారం, ప్రధాన కార్యదర్శిగా అర్జున్, కోశాధికారిగా రమేష్, ఉపాధ్యక్షుడిగా యుగేందర్, శ్రీకాంత్, సహాయ కార్యదర్శులుగా వెంకటయ్య, మహేష్, సభ్యులుగా రాముడు సాయికిరణ్, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా సంఘం సలహాదారులు గూండురు శ్యామ్‌కుమార్, సీనియర్ నాయకులు నిరంజన్, బాలయ్య, తిరుపతయ్య, యాదయ్య, వెంకటేస్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కొల్లాపూర్: పట్టణంలోని లోటస్ ఫంక్షన్‌హాల్‌లో సత్య సాయి విద్యానిలయంలో 1992–93 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులను సన్మానించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సోమిశెట్టి సురేష్, గోపాల్, ప్రవీణ్‌కుమార్, కురుమయ్య, ఎల్లగౌడ్, మాధురి, పూర్ణిమ, శ్రీదేవి ఉన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
కొల్లాపూర్ – వై. కురుమూర్తి – 79979 58205
అచ్చంపేట / కల్వకుర్తి – మహమ్మద్ ఫయాజ్ – 9550772550

సాక్షి – పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

పి. మధుసూదన్ గౌడ్ : 90100 06785